జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం

● ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం పెదనింద్రకొలను గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 148వ రోజుకు చేరుకుందని పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబుకు జెడ్పీటీసీ కోడే కాశి ఆధ్వర్యంలో గ్రామస్తులు పుష్పగుచ్ఛంతో ఘనస్వాగతం పలికారు, మహిళలు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి ప్రభుత్వ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావారణం నెలకొంది. ముందుగా స్థానిక ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజల ఆశీస్సులను అందించాలన్నారు. లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా ఉండి తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘన విజయం అందించాలని కోరారు. ఆయా లబ్ధిదారుల ఇళ్లకు జగనన్నే మా భవిష్యత్ స్టికర్లను ఆయనే స్వయంగా అంటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సచివాలయ మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, గ్రామా పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, సర్పంచ్‌లు ముగ్గళ్ల యాకోబు, పొట్నూరి ఉమా, వైస్ ఎంపీపీలు బండి రమణ విస్సాకు, సమయం వీరరాఘవులు, ఎంపీటీసీ చిన మిల్లి నరసింహమూర్తి, సొసైటీ అధ్యక్షులు దాట్ల శివ, దేవస్థానం చైర్మన్ ఉద్దరాజు పండు, మాజీ సొసైటీ అధ్యక్షులు వేగేశ్న సుబ్బరాజు, సర్పంచ్, ఎంపీటీసీల చాంబర్ అధ్యక్షులు పుప్పాల మెహర్‌కుమార్, దూసనపూడి సత్యానారాయణ, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు : ప్రభుత్వం రైతులకు పంట రుణ పరిమితిని రూ.4వేలు పెంచినట్లు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన పంటలైన వరి. శ్రీవరి. జొన్న. మొక్కజొన్న, పెసర, మినము, రాగి, కంది వంటి పలు రకాలు పంటలకు గతంలో ఉన్న పరిమితికి అదనంగా రూ.4వేలు రుణ పరిమితిని పెంచడం జరిగిందన్నారు. పెదపాడు మండలంలోని ఎస్.కొత్తపల్లి శివారు కడిమికుంట గ్రామంలోలో బుధవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని, ఇళ్ల స్థలాలు అందించాలని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యలను పరిష్కరించా లని సంబంధిత శాఖా అధికారులను ఆయన ఆదేశించారు. ఇళ్ల స్థలాలు అందించేందుకు భూసేకరణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని కొందరు కోరడంతో వెంటనే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటి లోను రాలే దని ఒక వ్యక్తి చెప్పడంతో వెంటనే హౌసింగ్ పీడీతో మాట్లాడి లోను ఇప్పించాలని సూచించారు. గ్రామంలో పట్టాలు మంజూ రైన వారికి జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. నాడు నేడులో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యా యుడిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, కొల్లేరు సంఘం నాయకులు ముంగర సంజీవకుమార్, సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావ రాజు సత్యన్నారాయణ, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, సర్పంచ్ చేపేని రంగారావు, పెదపాడు సర్పంచ్ కొత్తూరి జీవనకుమారి, సంబంగి శ్రావణ్‌కుమార్ వైకుంఠపు ధనంజయ్, తమలాల శ్రీనివాసరావు, కొత్తూరు విమలారావు, సాధం కిశోర్, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంపద సృష్టించే కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెదవేగి : గ్రామాలలో ప్రభుత్వం నిర్మించిన సంపద సృష్టించే షెడ్లలో తడి చెత్త, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు అందజేయడం వల్ల పంటలలో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని ఎంపీడీఓ జి.రాజ్ మనోజ్ అన్నారు. పంచాయతీల ద్వారా ఆదాయ వనరుల పెంపు, వాటి ద్వారా ఆర్థిక లోటు భర్తీ అనే అంశంపై సచివాలయ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. సచివాలయాలలో పనిచేసే ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రియాంక, ఏపీఓ హేమలత, ఉద్యాన, వ్యవసాయ, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గోపన్నపాలెం పంచాయతీ సర్వసభ్య సమావేశం

దెందులూరు : గోపన్నపాలెం గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి యహోషువా తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

దెందులూరు : ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య రైస్ మిల్లు యజమానులకు సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్ల ర్ దింపుకోవాలని, అవసరమైతే ఎక్కువ హమాలీలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. వారినుంచి ఎటు వంటి డబ్బులు వసూలు చేయరాదని, ధాన్యం దింపుకోకపోయినా, దింపుకునే ప్రక్రియలో డబ్బులు వసూలుచేసినా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని చెప్పారు.


అభయాంజనేయస్వామి ఉత్సవాలకు ఆహ్వానం



ఉత్సవాలకు ఆహ్వానపత్రాన్ని అందచేస్తున్న ఆలయ కమిటీ

దెందులూరు : ఈ నెల 14 నుంచి జరగనున్న అప్పనవీడు అభయాంజనేయస్వామి వార్షికోత్సవాలకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆహ్వానించారు. ఈమేరకు బుధవారం ఆలయ కార్యవర్గ కమిటీ ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రికను అందజేశారు. తొలుత స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్ ఉన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు



సరిపల్లెలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం : కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్మయి అన్నారు. సరిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆరోగ్యానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారం గురించి వివరించారు. ఈ సందర్భంగా 61 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు పడినట్లు ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారానికి కనీసం రెండు సార్లు ఆకు కూరలు తినాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స

ఏలూరు టౌన్: తలసేమియా చిన్నారులకు అండగా ఉండాలని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి కోరారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం సుమారు 11 మంది చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. వీరిని రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు, సహాయకులకు 30 మందికి ఏలూరు మానవత వైస్ ప్రెసిడెంట్ మానేపల్లి సునీత, సత్యనారాయణ దంపతులు కల్పించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



ఉంగుటూరులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కిషోర్



భీమడోలులో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న తహసీల్దార్ షంషూద్దీన్

ఉంగుటూరు : తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏలూరు ఆర్డీవో పెంచల కిషోర్ స్పష్టం చేశారు. బుధవారం ఉంగుటూరు మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించి తడిసిన ధాన్యాన్ని, రాశులను పరిశీలించారు. ఎగుమతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు యథాతంగా కొనసాగుతుందని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ పోతురాజు, సివిల్ సప్లయి డీటీ శేఖర్ ఉన్నారు.

భీమడోలు : భీమడోలులో తడిసిన ధాన్యాన్ని, ధాన్యం రాశులను బుధవారం తహసీల్దార్ షంషూద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించిందన్నారు. తడిసిన ధాన్యంకు సంబంధించిన వివరాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది సేకరిస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా 13వేల ఎకరాల్లో 33,250 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 26వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారన్నారు. సుమారు 80శాతం ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని వారం రోజుల్లో మిల్లులకు తరలిస్తామన్నారు. రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావద్దన్నారు.

ధాన్యం వెనక్కి పంపితే కఠిన చర్యలు

మిల్లర్లను హెచ్చరించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు : ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వెనక్కి పంపితే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే మిల్లును సీజ్ చేసేందుకు కూడా వెనుకాడబోనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హెచ్చరించారు. కొన్ని రైసు మిల్లులపై రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తీవ్రంగా స్పందించారు. బుధవారం దెందులూరులో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతుకు అండగా ఉంటుందని, రైతు పండించిన ప్రతి గింజకు భరోసా కల్పించడంతో పాటు రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క రైతు అధైర్యపడవద్దని, రంగుమారిన, తడిసిన, మొలకెత్తినా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, విజిలెన్స్ శాఖలు సమన్వయం, ప్రణాళికతో అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. అన్ని మిల్లులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. మూడు మిల్లులపై వచ్చిన ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్యను ప్రశ్నించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే అన్ని మిల్లులకు సంబంధిత గ్రామాల వీఆర్‌ఓలను కస్టోడియన్లుగా నియమించడం జరిగిందని, తానే స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నానని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. ఏ రైతు సమస్య వచ్చినా నాకు ఫోన్ చేయాలని నేరుగా పొలానికి, మిల్లుకు తానే వచ్చి సమస్యను పరిష్కరిస్తానన్నారు.

సత్తా ఉంటే కేంద్రంతో మాట్లాడాలి

ప్రకృతి వైపరీత్యం కారణంగా వర్షాలు వస్తే రైతులకు అందరం కలిసి న్యాయం చేయాల్సింది పోయి దెందులూరు నియోజకవర్గంలో పర్యటించిన బీజేపీ నేత సోము వీర్రాజు రాజకీయం చేయడం సరికాదన్నారు. సత్తా ఉంటే కేంద్రంతో మాట్లాడి రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు సహాయసహకారాలు అందించాలన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో రైతు పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి దేశంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ముఖ్యమంత్రి చేయడం లేదన్నారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుబ్బారావు, సివిల్ సప్లయ్స్ డీఎం, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు గంటా ప్రసాదరావు, జెడ్పీ వైస్ చైర్మన్ విజయబాబు, జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, తొత్తడి వేదకుమారి, కాటి సుధాకర్, పోకల రాంబాబు, కొలుసు గణపతిరావు, కొమ్మిన రాము, బోదుల స్వరూప్, పాకలపాటి శ్రీనివాసరావు, తాళ్లూరి నాగరాజు, నిట్టా గంగరాజు, గోరిపర్తి రంగారావు తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ



శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేస్తున్న యాదవులు



గోపికా, కృష్ణుని వేషధారణలో చిన్నారులు

గణపవరం: గణపవరం వైఎస్సార్ కాలనీలో యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయంలో బుధవారం ఉదయం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంవద్ద నిర్మించిన యాగశాలలో మూడు రోజులుగా వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు, యజ్ఞయాగాదులు నిర్వహించారు. బుధవారం ఉదయం యంత్రస్థాపన, ధ్వజస్థాపన, బింబస్థాపన, ప్రాయశ్చిత హోమాలు, మహా పూర్ణాహుతి, కలశఉద్వాసన, ఆలయ ప్రవేశం, ప్రాణప్రతిష్ఠ, కుంబాభిషేకం, దివ్యదర్శన, మహానైవేద్యం తదితర కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించి, 8.30 గంటలకు వేదపండితులు పూజలు చేసి వేద మంత్రోచ్చారణల మధ్య సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీకృష్ణ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం ముందు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంత లక్ష్మి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. గొల్లకిషోర్ యాదవ్ దంపతులు వేణు గోపాలస్వామి విగ్రహానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కీసరగుట్ట వేదపాఠ శాల అధ్యాపకులు, ఆగమ పండితులు బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతి శర్మ శిష్యబృందం, బ్రహ్మశ్రీ రుద్రపాక శశిధరశర్మ, బ్రహ్మశ్రీ దిలీప్‌శర్మల ఆధ్వ ర్యంలో విగ్రహప్రతిష్ఠా కార్యక్రమాలు జరిగాయి.

ఈదురుగాలులతో భారీ వర్షం



ధాన్యానికి టార్పాలిన్లు కప్పుకుంటున్న రైతులు

పెదవేగి : మండలంలో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మూడురోజులుగా పడుతున్న వర్షాలకు రైతులు బెంబేలెత్తుతున్నారు. ధాన్యం బయట ఆరబోసుకున్న రైతులు ఆకాశంలో కారు మబ్బులు, పడుతున్న చినుకులు చూసి ఆందోళన చెందుతున్నారు. టార్పాలిన్లు కప్పుతూ, ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

చదరంగంతో మేధస్సు పెంపు



భీమడోలులో చెస్ ఆడి శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ భవానీ రంగ

భీమడోలు : మెదడుకు పదును పెట్టి మేధస్సును పెంచేందుకు చదరంగం ఎంతగానో దోహద పడుతుందని జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలులోని ఓ కల్యాణ మండపం వద్ద వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన చదరంగం శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. చిన్నారులతో ఆమె చెస్ ఆడారు. చెస్ ఆడే తరుణంలో మెలకువలను సీనియర్ కోచ్ పాలూరి కిరణ్‌కుమార్, శ్యామల వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ప్రజాసేవకుడు అర్ధవరం రాము



ఎంపీపీ అర్ధవరం రామును అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : చిన్న వయస్సులోనే ఎంపీపీ అధ్యక్ష పదవిని ఏకగ్రీవంగా గెలుచుకున్న అర్ధవరం రాము ఆ పదవికి న్యాయం చేసి నిజమైన ప్రజాసేవకుడుగా గుర్తింపు పొందారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అర్ధవరం రాము పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుబాబు ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచి నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నీటిసమస్య వస్తే తనదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, తహసీల్దార్ పమ్మిలక్ష్మి, ఎంపీడీవో జ్యోతిర్మయి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



అమ్మపాలెంలో మొక్కజొన్న కల్లాల వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం, ఏపీ రైతు సంఘ నేతలు

పెదవేగి : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అకాల వర్షాలకు తడిపిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బుధవారం పెదవేగి మండలంలోని అమ్మపాలెం, భోగాపురం, దుగ్గిరాల గ్రామాలలో సీపీఎం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పర్యటించి అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్నను పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేయడంతో మొక్కజొన్న రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంట కల్లాల్లో ఉండిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్ రూ.1962 కాగా వ్యాపారులు రూ.1600 కే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కన్వీనర్ చందు సత్తిబాబు, మొక్కజొన్న రైతు మండపాక వెంకటేశ్వరావు, సీపీఎం నాయకులు పి.ఆదిశేషు, జె.గోపి పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

పెదపాడు : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రవి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం వట్లూరులో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు గోనె సంచులు ఇవ్వాలని కోరారు. నష్టపోయిన కౌలు రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. సీపీఎం నాయరకులు పిచ్చుక ఆదిశేషు, జే గోపి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కన్వీనర్ చందు సత్తిబాబు, పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

చెరువుల లీజులో ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజక వృత్తిదారులకు చెరువులపై లీజు విధానంలో ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు.రజకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డీపీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. డీపీఓ విజయ కుమారి, డీఎల్‌పీఓ అన్నామణిని కలిసి పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఆ వివరాలను అనంతరం స్థానిక జిల్లా సంఘ కార్యాలయంలో వెల్లడించారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో 1972లో నాటి సర్పంచ్ కాలే ప్రకాశరావు సర్వే నెంబర్ 389లో ఆరెకరాల ధర్మకుంట అనే లింగంకుంట చెరువును రజకులకు కేటాయించారన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రజకులు లీజు చెల్లిస్తున్నారని తెలిపారు. అయితే గత మూడేళ్ల క్రితం లీజు రూ.55 వేలు ఉండగా తాజాగా లీజును భారీగా పెంచేందుకు పంచాయతీ అధికారులు సన్నాహాలు చేయడం తగదన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన జీఓ నెం.499 ప్రకారం రజక వృత్తిదారుల చెరువుల లీజు ఏటా 10 శాతం దాటకుండా వేయాల్సి ఉందని గుర్తుచేశారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ ఆదేశాలు అమలు పర్చే విధంగా జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా రజక జన సంఘం నాయకులు విశాల శ్రీనివాసరావు, కోటి చుక్కల నాగేషు, అట్రగడ్డ ప్రభాకరరావు, ఎ.శ్రీరాములు, వేల్పూరు రాజు, బయ్యన్నగూడెం లక్ష్మీప్రసన్న, కడెల్లి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో స్టే కొట్టివేతపై హర్షం

ఏలూరు (టూటౌన్): చంద్రబాబు హయాంలో అక్రమాలపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ డీవీ రామాంజనేయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అమరావతి భూ కుంభకోణంతో సహా కీలక ప్రాజెక్టుల విధానాల్లో జరిగిన అవినీతిపై దర్యాప్తునకు ఉన్న ఆటంకాలు తొలగాయని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కీలక విధాన నిర్ణయాలు, అమరావతి భూ కుంభకోణం సహా భారీ ప్రాజెక్టుల్లో జరిగిన అవకతవకలపై సిట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రజాధనం దుర్వినియోగం, దురుద్దేశం తదితర అంశాలపై దర్యాప్తు చేస్తే తప్పేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించడాన్ని స్వాగతించారు. గత ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష జరపొద్దు అంటే వంద శాతం అక్రమాలను ప్రోత్సహించినట్టు కాదా అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం హర్షణీయమని తెలిలిపారు. ప్రాథమిక దశలోనే దర్యాప్తును అడ్డుకోవడం సమంజసం కాదన్న ఏపీ ప్రభుత్వం తరుపున న్యాయవాది వాదనలతో సుప్రీంకోర్టు ఏకీభవిస్తూ చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం సిట్ నియామకంపై ఏపీ హైకోర్టు ఇచ్చిన స్టేను సుప్రీంకోర్టు కొట్టి వేయడాన్ని వైఎస్సార్‌సీపీ లీగల్ పక్షాన స్వాగతిస్తున్నట్టు రామాంజనేయులు పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

భీమడోలు : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేయాలంటూ సీఐటీయు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారి భీమడోలు జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.యుగంధర్, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ, కట్టా భాస్కరరావు, శేషుగిరి, జి.ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

7న కళా ఉత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి, మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 7న వైఎంహెచ్ఏ హాలులో కళా ఉత్సవం ఏర్పాటు చేసినట్లు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ, హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ వివరాలను ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సీఐటీయూ ఏలూరు నగర కార్యదర్శి వి.సాయిబాబు, హేలాపురి సింగర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రవి వెల్లడించారు. ఏడో తేదీ సాయంత్రం నాలుగు నుంచి 7 గంటల వరకు 99 మంది అల్లూరి సీతారామరాజు వేషధారులతో అల్లూరికి నివాళులర్పించడం, ప్రజా గీతాలకు శాస్త్రీయ నృత్య నీరాజనం, కోలాట ప్రదర్శనలు, నృత్య రూపకాలు మేడే పాటల వీడియో ప్రదర్శనలతో కళా సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాకారులకు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సంవత్సర ప్రశంసా పత్రాలు, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర పుస్తకాలు అందజేస్తామని పేర్కొన్నారు.